క్లుప్తంగా

సేవే ధ్యేయంగా 'చిలుకూరి'



బంగ్లాతోటలో ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న చిలుకూరి

రామచంద్రపురం: పేదలకు సేవ చేయటమే ధ్యేయంగా చిలుకూరి సేవా సమితి ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చిలుకూరి సేవా సమితి అధ్యక్షుడు చిలుకూరి వీవీ సత్యనారాయణ అన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని 19వ వార్డులో బంగ్లాతోటలో 80 మంది పేదలకు ఆదివారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ప్రతి నెలా మూడో వారంలో ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్‌లో ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టి పేద ప్రజలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని చిలుకూరి సత్యనారాయణ తెలిపారు. రామకృష్ణ, బంగ్లాతోట పెద్దలు పాల్గొన్నారు.

డ్రైన్ల ఆధునీకరణకు కృషి చేయాలి

కాజులూరు: మండలంలో డ్రైన్ల ఆధునీకరణకు అధికారులు కృషి చేయాలని తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో వరి పొలాలు కాలువ శివారు భూముల్లో ఉన్నాయన్నారు. ఎగువ ప్రాంతం నుంచి పలు ప్రధాన డ్రైన్లు మండల గ్రామాల మీదుగా ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తున్నాయన్నారు. ఇవి పూర్తిగా పూడుకుపోయి ఉండటంతో కొద్దిపాటి వర్షాలకే పొలాలు మునిగిపోయి పంట రోజుల తరబడి నీటిలో నానిపోతున్నాయన్నారు. అలాగే పంటలకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. గ్రామాల్లో వ్యవసాయానికి ఇది ప్రధాన సమస్యగా మారిందన్నారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ నెక్కంటి శ్రీహరి మృతి



నెక్కంటి శ్రీహరి (ఫైల్)

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల ప్రొఫెసర్ నెక్కంటి శ్రీహరి (75) శనివారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా రాజమహేంద్రవరంలో ఉంటున్నారు. మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుమారుడు నెక్కంటి శ్రీరాంజీ గతంలో కపిలేశ్వరపురం వైస్ ఎంపీపీగా పనిచేశారు. శ్రీరాంజీని మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ పరామర్శించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఫోన్లో పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: యానం–ద్వారపూడి రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. యానంకు చెందిన మాత రాంబాబు తన బైక్‌పై ద్రాక్షరామ వెళ్లి తిరిగి వస్తున్నారు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడచి వెళుతున్న ఒక వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్‌బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో రాంబాబు గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి గాయాలపాలైన అతడిని యానం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వలస కూలీ మృతదేహం లభ్యం

కపిలేశ్వరపురం: ఈ నెల 19న గోదావరి నదిలో గల్లంతైన కేదారిలంకలోని ఇటుక బట్టీ వలస కూలి తడింగి సోబన మృతదేహం ఆదివారం లభ్యమైంది. రెండు నెలలుగా గ్రామంలోని పోలిశెట్టి గణేష్ నిర్వహణలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న కూలి సోబన ఒడిశాలోని కోరాపుట్ జిల్లా లంగల్‌బాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారాయణపట్నం గ్రామానికి చెందిన వాడు. స్నానానికి దిగిన కూలి ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతయ్యాడు. మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఏఎస్సై రంగారావు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాయవరం: మండలంలోని పసలపూడికి చెందిన ప్రకాష్ (30) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ప్రకాష్ భార్య లీలావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయవరం ఎస్సై పీవీఎస్ఎస్ సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం లీలావతికి, ప్రకాష్‌కు 2011లో వివాహమైంది. అప్పటి నుంచి లీలావతిని భర్త ప్రకాష్ శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంపై రాయవరం పోలీసు స్టేషన్‌లో లీలావతి ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి ప్రకాష్ ఇంటికి రాకుండా ఫోన్లో భార్యను వేధిస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం 6.30గంల ప్రాంతంలో లీలావతి తల్లిదండ్రులతో ఉండగా, ప్రకాష్ ఇంటి ముందు పడుకుని ఉండడాన్ని గమనించారు. దగ్గరకు వెళ్లి చూసే సరికి నోటి నుంచి నురగ రావడం గమనించి రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రకాష్ మృతి చెందినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

పీహెచ్‌సీల్లో అదనపు వైద్య సేవలు

- అందుబాటులో అధునాతన యంత్ర పరికరాలు
- పీహెచ్‌సీల్లో 63 రకాల వైద్య పరీక్షలు
- శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లు



దంగేరు పీహెచ్‌సీకి చేరిన యంత్రపరికరాలు

కె.గంగవరం: ఇప్పటికే ప్రభుత్వ వైద్య రంగంలో పెను మార్పులను తీసుకువచ్చింది. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ప్రభుత్వం వైద్యం అందని ద్రాక్షగా ఉండగా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పేదల ఆరోగ్యం కోసం గ్రామాల్లోనే ఆసుపత్రులను ఏర్పాటు చేసి వైద్యులను నియమించింది. దీంతో పాటు ఇకపై పీహెచ్‌సీల్లో రోగులకు మరిన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ఇందు కోసం వైద్య, ఆరోగ్యశాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలకు అందజేసింది. ఒక్కో పీహెచ్‌సీకి పరీక్షల నిమిత్తం సీబీసీ, ఎలక్ట్రోలైట్ ఎనలేజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, టీబీ ఆర్టీపీసీఆర్ యంత్ర పరికరాలను సమకూర్చింది. ఇప్పటి వరకూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం 15 నుంచి 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. కొత్తగా చేరిన పరీక్షలతో కలిపి ఇకపై వాటి సంఖ్య 63కి పెరగనుంది. వైద్య పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా నియమించింది. ఇప్పటికే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఉన్న పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లను శిక్షణ కూడా పూర్తి చేశారు.

ఎంతో మేలు..

గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద చాలా రకాల వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో పరీక్షలు చేయించుకోవడానికి సమీప ఏరియా ఆసుపత్రి, లేదా ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వచ్చేది. ఇది సహజంగానే రోగులకు ఆర్థిక భారం అవడంతో పాటు అదనంగా శ్రమ పడాల్సి వచ్చేది. దీని వల్ల రోగ నిర్ధారణకు ఎక్కువ సమయం పట్టేది. పరీక్షల ఫలితాలు వచ్చేంత వరకు రోగికి వైద్యం అందేది కాదు, ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు కూడా అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే రోగుల వ్యాధి నిర్ధారణకు వీలవుతుంది. ఫలితంగా వెంటనే రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం కలుగుతుంది.

చేసే వైద్య పరీక్షలివే..

ప్రభుత్వ గ్రామీణ ఆసుపత్రుల వద్ద ఇకపై నుంచి సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్‌ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్ లెట్ కౌంట్, సీబీసీ, టోటల్ బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్‌ఐవీ, హెపటైటిస్–బీ, డెంగీ, బ్లీడిం, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్ తదితర 63 రకాల పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి.

త్వరలోనే అందుబాటులోకి..



ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు త్వరలో అందుబాటులోకి వస్తాయి. ఇకపై పరీక్షల కోసం పట్టణ ప్రాంతాలకు రోగులు వెళ్లనవసరం లేదు. త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది. తదుపరి వెంటనే మెరుగైన వైద్యం అందిస్తాం.

– టి.మాణిక్యం, పీహెచ్‌సీ వైద్యాధికారి, పామర్రు

పీహెచ్‌సీకి చేరిన యంత్రపరికరాలు



రోగులకు వివిధ వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు, మెషినరీ ఇప్పటికే పీహెచ్‌సీకి చేరాయి. వైద్య పరీక్షలు ఎలా చేయాలో ప్రాథమికంగా కొంత శిక్షణ కూడా ఇచ్చారు. పీహెచ్‌సీల్లో పేదలకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయి.

– టి.సాయిమౌనిక, ల్యాబ్ టెక్నీషియన్

ఘనంగా పాలతోడు బాపనమ్మ తీర్థం



వెంకన్నబాబు, హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, పార్టీ నేతలను సత్కరిస్తున్న అరవరాజు తదితరులు

మండపేట: మండలంలోని పాలతోడులో కొలువైన బాపనమ్మ తల్లి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పాలతోడు సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు దంపతులు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, మెర్నిపాడు సర్పంచ్ గారపాటి సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యురాలు చింతా రజని, హరిశ్చంద్ర ప్రసాద్‌రెడ్డి దంపతులు, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గంగరాజు దేవి, ప్రసాద్ దంపతులు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామానికి విచ్చేసిన పార్టీ నాయకులను సర్పంచ్ వెంకటలక్ష్మి, అరవరాజు దంపతులు సత్కరించారు. ఆలయ ధర్మకర్త ఏలేటి వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, పార్టీ నాయకులు పిల్లా సూరిబాబు, పిల్లా సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా గీతాజ్ఞాన మందిరం వార్షికోత్సవం



శ్లోకాల పోటీలో విజేతలతో గీతా జ్ఞాన మందిరం నిర్వాహకులు

రాయవరం: మండలంలోని వెదురుపాక గీతాజ్ఞాన మందిరం 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వేకువజాము నుంచి వేడుకలు నిర్వహించారు. మందిరంలోని శ్రీకృష్ణభగవానుడికి అష్టోత్తర తులసీ దళ అర్చనలు, భగవద్గీతలోని 18 అధ్యాయాల సామూహిక పారాయణం చేశారు. గాయత్రీ ఆస్థాన పీఠాధిపతి టికిరాల సుబ్రహ్మణ్యంశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. భగవద్గీత వైభవాన్ని భక్తులకు వివరిస్తూ భగవద్గీత మానవ జీవితానికి మార్గదర్శకం చేస్తుందన్నారు. వయోబేధం లేకుండా ప్రతి ఒక్కరూ గీతాధ్యయనం చేయాలన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలకు భగవద్గీతలోని ప్రథమ అధ్యాయంలోని అర్జున విషాదం యోగం కంఠస్థ పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు రాయవరం చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, వరలక్ష్మి దంపతులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, విష్ణు సేన ట్రస్ అంగర జనార్దనాచార్యులు, కొమరిపాలెం యోగా గురువు తాడి అరవిందం, సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని అన్న సమారాధన చేపట్టారు.

అక్రమ కేసులతో వేధిస్తున్నారు

రాయవరం ఎస్సైపై మహిళ ఆరోపణ

మండపేట: సరిహద్దు తగాదా విషయంలో రాయవరం ఎస్‌ఐ పీవీఎస్ఎన్ సురేష్ కక్ష పూరితంగా తనపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని రాయవరం మండలం పసలపూడికి చెందిన కొవ్వూరి శ్రీలక్ష్మి ఆరోపించారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సరిహద్దు స్థలం విషయమై తన పొరుగింటి వారు గత నెలలో తనపై దాడి చేయడంతో రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు శ్రీలక్ష్మి తెలిపారు. ఎస్‌ఐ సరిగా స్పందించకపోవడంతో తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. దీంతో తనపై కక్ష పెంచుకుని ఈనెల 5న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళుతున్న తనను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో రెండు రోజులు నిర్బంధించారన్నారు. ఏ తప్పు చేయని తనపై కక్ష గట్టి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను స్టేషన్‌లో ఎస్‌ఐ లైగింక వేధింపులకు గురి చేశారని, కులం పేరుతో దూషించారని, కడుపుపై బూటు కాలితో తన్నారన్నారు. ఎస్‌ఐ నుంచి తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని శ్రీలక్ష్మి పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. కొవ్వూరి కృష్ణ, కొవ్వూరి మేరీ, కొల్లపు రాజు, నిడిగట్ల వెంకట్రావు, దండంగి శ్రీదేవి, పచ్చిమాల బుజ్జి, ఏలేటి నాగరాజు, చేవులే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవం

ఈ విషయమై రాయవరం ఎస్‌ఐ పీవీఎస్ఎన్ సురేష్‌ను వివరణ కోరగా శ్రీలక్ష్మి ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవమన్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరు వర్గాల వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఉద్దేశ పూర్వకంగానే ఆమె తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మహిళ ఆపరేషన్‌కు 'మానవత' సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మానవత గ్రూపు సభ్యులు

మలికిపురం: లక్కవరంలో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి చెందిన మహిళ అపరేషన్‌కు మానవత గ్రూపు సభ్యులు, దాతలు ముందుకు వచ్చారు. భట్నవిల్లి గ్రామానికి చెందిన కరాటం వీరవేణి కుటుంబం లక్కవరంలో స్థిరపడ్డారు. ఆమెకి అత్యవసరంగా గర్భసంచి ఆపరేషన్ చేయాల్సి రావడంతో దాతలు రూ.20 వేలు సమకూర్చారు. లక్కవరం గ్రామానికి చెందిన ముదునూరి ప్రసాదరాజు రూ.10 వేలు, గేదెల శివశంకర్ రూ.3 వేలు మరో ఐదుగురు దాతలు సహకారంతో రూ.20 వేలు సమకూర్చారు. ఆదివారం లక్కవరం సత్య ఆసుపత్రి వైద్యులు కొప్పినీడి శ్రీహరితో మానవత గ్రూపు సభ్యులు సంప్రదించి తక్కువ ఖర్చుతో ఆపరేషన్ చేసేందుకు మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బోనం సాయిరాం, బోనం రాజు, యేపుగంటి రాంబాబు, దొడ్డా వెంకటపతి, బోనం కాశి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు చేయూత

రావులపాలెం: క్యాన్సర్‌తో ఒకరూ, నిమోనియాతో మరొకరు అనారోగ్యం పాలై బాధపడుతున్న వారికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ఊబలంక గ్రామానికి చెందిన రాజోలు సీతామహాలక్ష్మి గత మూడేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతుంది. పేదరికంతో వైద్యఖర్చులకు నానా ఇబ్బంది పడుతుంది. విషయం తెలుసుకున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆమెకు రూ.10 వేలు వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయంగా అందజేశారు. అలాగే ఏలూరు పట్టణానికి చెందిన సాయిశ్రీశ్రద్ధ అనే పాప గత మూడు నెలలుగా నిమోనియాతో బాధపడుతుంది. తల్లిదండ్రులు విజయవాడలో ఆంధ్రా హాస్పిటల్‌లో వైద్యం చేయిస్తున్నారు. పేదరికంతో వారు వైద్యఖర్చుల నిమిత్తం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరారు. దీంతో సేవా సమితి సభ్యులు కొందరు విజయవాడ వెళ్లి అక్కడ ఆంధ్రా ఆస్పత్రి వద్ద ఆ పాప తల్లిదండ్రులకు రూ.15 వేల వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయంగా అందజేసినట్టు సేవాసమితి సభ్యులు తెలిపారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. అటవీశాఖ సమకూర్చిన పలు రకాల మొక్కలను చైర్మన్ రామకృష్ణ ఆదివారం అప్పనపల్లి ఆలయం వద్ద భక్తులకు ఉచితంగా అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పర్యావరణహిత జీవన శైలిని అలవర్చుకుంటామంటూ భక్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ఎం.రామిరెడ్డి, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరవు తీరా ఎరువు

- మూడు నెలల ముందుగానే ఆర్‌బీకేలకు ఎరువులు
- క్లస్టర్ పరిధిలో 3,587 మెట్రిక్ టన్నుల వినియోగం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



ఎరువులను దిగుమతి చేసుకుంటున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రాయవరం: వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్న నానుడిని ప్రభుత్వం నిజం చేసి చూపిస్తోంది. ప్రస్తుతం రబీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో పది రోజుల్లో రైతులు రబీ పనులకు సన్నద్ధం కానున్నారు. వచ్చే ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరిస్తోంది. ఖరీఫ్‌కు ఎరువుల కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే రైతు భరోసా కేంద్రాలకు ఎరువులను దిగుమతి చేస్తోంది. మూడు నెలల ముందుగానే ఎరువులను ఆర్‌బీకేల వద్ద నిల్వలు పెట్టడంతో రైతులపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను చెప్పకనే చెబుతోంది.

క్లస్టర్ పరిధిలో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టనున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే రబీ పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. రబీ పనులు పూర్తికాగానే సాధారణంగా రైతులు గట్టు లంక పనులు పూర్తి చేసుకుని, మెరక, పల్లాలను చదును చేసుకుంటారు. ఒక పక్క ఈ పనులు చేసుకుంటుండగానే మరో పక్క రైతులు వరి నారుమళ్ల పనులు ప్రారంభిస్తారు. గతేడాది మాదిరిగా జూన్ మొదటి వారంలో నీటి పారుదల శాఖ కాలువకు నీటిని విడుదల చేస్తే వరి నారు మడులకు శ్రీకారం చుడతారు. బోర్లపై సాగు చేసే వారు కూడా వరి నారు మళ్లను సిద్ధం చేసుకుంటారు.

రైతులు నష్టపోకూడదనే

రైతులకు నష్టం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎరువులను సిద్ధం చేసింది. ఖరీఫ్‌లో యూరియా, డీఏపీ, మ్యూరేట్ ఆఫ్ పొటాషియం(ఎంవోపీ), సింగిల్ సూపర్ పాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) ఎరువులు వినియోగిస్తారు. నారుమళ్ల సమయంలో యూరియా, 20-20-0-13 ఎరువులు ఉపయోగిస్తారు. వరినాట్ల సమయంలో సూపర్, డీఏపీ, యూరియా, పొటాష్‌లను వినియోగిస్తారు. సాధారణంగా ఖరీఫ్‌లో ప్రతి ఎరువుకూ కృత్రిమ కొరతను సృష్టించి, వ్యాపారులు లాభపడడానికి ప్రయత్నిస్తారు. ప్రభుత్వం దీన్ని గుర్తించి, ముందస్తు ప్రణాళికను అమలు చేస్తోంది. అందులో భాగంగా ఆయా మండలంల్లో వరి సాగు, ఇతర పంటలకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాలకు తరలిస్తోంది.

క్లస్టర్ పరిధిలో ఎరువుల వినియోగ లక్ష్యం

మండలం	విస్తీర్ణం	యూరియా	కాంప్లెక్స్	డీఏపీ	ఎంవోపీ	ఎస్ఎస్‌పీ
మండపేట	18512	415	201	58	49	20
కపిలేశ్వరపు	18672	418	203	58	49	20
ఆర్‌సీపీఎం	19207	430	208	60	51	21
కె.గంగవరం	18240	409	198	57	48	20
రాయవరం	14862	333	161	46	39	16


రైతు సంక్షేమ ప్రభుత్వం



రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుంది. గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మేలు చేసేలా మెరుగైన నిర్ణయలు తీసుకుంటున్నారు. మూడు నెలల ముందుగానే ఎరువులు సరఫరా చేయడం రైతులపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

– సిరికి కృష్ణారావు, కౌలు రైతు, వి.సావరం, రాయవరం మండలం

ఆర్‌బీకేల్లో నిల్వలు



పది రోజుల నుంచి ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో దిగుమతి చేసుకుంటున్నాం. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. దీని వలన ఎరువుల కొరత అనే సమస్య ఉత్పన్నం కాదు. రైతులు నేరుగా ఆర్‌బీకేల వద్ద ఎరువులను కొనుగోలు చేసుకోవచ్చు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం మండలం

కార్మికుని కుటుంబానికి ఉపసర్పంచ్ ఆర్థిక సాయం



పారిశుధ్య కార్మికుడి కుటుంబీకులను పరామర్శించి సాయం అందజేస్తున్న ఉపసర్పంచ్ భువనేశ్వరి

కాజులూరు: గొల్లపాలెంలో ఇటీవల వడదెబ్బకు గురై మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు కావూరి రాంబాబు (రాముడు) కుటుంబీకులకు గ్రామ ఉప సర్పంచ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తాడి భువనేశ్వరి ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక గ్రామ పంచాయతీలో కాంట్రాక్ట్ పద్ధతిపై పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న రాముడు గత బుధవారం వడదెబ్బకు గురై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉపసర్పంచ్ భువనేశ్వరి ఆదివారం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావు, యువజన విభాగం కార్యదర్శి నిమ్మితి విజయ్ తదితరులతో కలసి వెళ్లి మృతుని కుటుంబీకులను పరామర్శించి బస్తా బియ్యం, నెలకు సరిపడ నిత్యావసరాలు, కూరగాయలు, రూ.ఐదువేల నగదు అందజేశారు. విధినిర్వహణలో రాముడు సేవలను నాయకులు కొనియాడారు. అనన్య న్యూట్రిషన్ క్లబ్ సభ్యులు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఇంటర్నేషనల్ క్యాండిల్ లైట్ డే



ఏరియా ఆసుపత్రి వద్ద క్యాండిల్స్ వెలిగించిన ఐసీటీసీ సిబ్బంది

రామచంద్రపురం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆదివారం సాయంత్రం ఇంటర్నేషనల్ క్యాండిల్ లైట్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి వద్ద క్యాండిల్స్‌ను వెలిగించి నినాదాలు చేశారు. ఐసీటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశీల మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణం కోస హెచ్ఐవీ పాజిటివ్ గల వారిపై ప్రేమ, సంఘీభావం కలిగి ఉండాలనే నినాదంతో ఇంటర్ నేషనల్ క్యాండిల్ లైట్ డేను నిర్వహించినట్లు తెలిపారు. ఎల్‌డీసీ ప్రసాద్, ఐసీటీసీ, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో డీఎస్పీ పూజలు



డీఎస్పీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న పీఠం ప్రతినిధులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠాన్ని ఆదివారం రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ సందర్శించారు. పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారికి డీఎస్పీ ప్రసాద్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. గాడ్ సమక్షంలో పీఠం ప్రతినిధి గాదె భాస్కర నారాయణ, పీఆర్వో బాబీలు డీఎస్పీ ప్రసాద్‌ను దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. గతంలో రాయవరం ఎస్సైగా విధులు నిర్వర్తించిన సమయంలో పీఠంతో తనకు ఉన్న అనుబంధాన్ని డీఎస్పీ ప్రసాద్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట ఎస్సై పీవీఎస్ఎన్ సురేష్, ఏఎస్సై పి.వెంకటేశ్వర రావు, సిబ్బంది ఉన్నారు.

రాజీవ్‌గాంధీతోనే దేశంలో సాంకేతిక విప్లవం

కాజులూరు: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీతోనే దేశంలో సాంకేతిక విప్లవం ప్రారంభమయిందని అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కదలి రాంపండు అన్నారు. ఆదివారం రాజీవ్ 33వ వర్ధంతి సందర్భంగా ఆర్యావటం కోళ్ళతూము సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవ్వా ప్రసాద్, దోనం అబ్బు, వడ్డి శ్రీను, ఎంఆర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ కౌన్సిలర్ మృతి

మండపేట: టీడీపీ మాజీ కౌన్సిలర్ కడియాల సత్యనారాయణ (70) ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2005 కౌన్సిల్‌లో ఆయన 23వ వార్డు కౌన్సిలర్‌గా సేవలు అందించారు. సత్యనారాయణ మృతదేహానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ నాయకులు నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఇసుక అక్రమ తవ్వకాలను ఆపాలి

పి.గన్నవరం: మండలంలోని పెదకందాలపాలెం ర్యాంపు నుంచి మానేపల్లి శివారులోని లంకభూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఐ నాయకులు, స్థానికులు ఆందోళన నిర్వహించారు. అనుమతులు ముగిసినా ఇసుక తీస్తున్నారని వారు ఆరోపించారు. ఇసుక తవ్వకాలను నిలిపి వేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సీపీఐ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్, స్థానికులు యల్లమెల్లి చిట్టిబాబు, పుచ్చకాయల చంటి, సత్యనారాయణ, పోతుల వెంకటరమణ, పుల్లెల్ల ఆనంద్ తదితరులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఇసుక తవ్వకాలకు తమకు అనుమతులు ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు లారీలను అడ్డగించి ఆటంకం కలిగ్తిస్తున్నారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.